తాగునీటి కష్టాలు

- కొలాంగూడలో ఇంటింటికీ అందని నల్లా నీరు
- పనిచేయని చేతిపంపులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా నల్లా



చేతిపంపు వద్ద కొలాంగూడ గ్రామస్తులు

వాంకిడి: ప్రతీపల్లెకూ ఇంటింటికీ నల్లా నీరందించాలనే సంకల్పంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఈ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. కాంట్రాక్టర్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తూ పైప్‌లైన్లు, నల్లాల బిగింపులు నాసిరకంగా చేపట్టడాన్ని అధికారులు «మామూలు»గా తీసుకోవడంతో అవి కొన్నినెలలకే పాడైపోయాయి. ఏ గ్రామంలో చూసినా నల్లాలు విరిగి, ఊడిపోయి దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో అసలు నల్లాలే బిగించని పరిస్థితి. వాంకిడి మండలంలోని పాతగూడ పంచాయతీ పరిధి ఎనోలి కొలాంగూడలో వేసవి ప్రారంభంలో తాగు నీటి కష్టాలు మొదలయ్యాయి.

కొలాంగూడలో..

ఎనోలి కొలంగూడ గ్రామంలో 27 కుటుంబాలు ఉంటాయి. రెండు చేతిపంపులు ఉన్నాయి. వేసవి ప్రారంభంలో భూగర్భజలాలు అడుగంటిపోతుండటంతో చేతిపంపులు పనిచేయడం లేదు. ఒక్కొక్క చేతిపంపు వద్ద 10 బిందెలు నీటి కోసం గ్రామస్తులు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఇద్దరూ కలిసి చేతిపంపు కొడితే గాని నీరు రాని పరిస్థితి. ఏడాది నుంచి భగీరథ నీరు సరిగ్గా రావడం లేదని పలువురు గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాడైన నల్లాలు..

ఇంటింటికీ పైపులైన్ వేసి బిగించినా నల్లాలు ఇప్పటికే పాడైపోయాయి. ఆ నల్లాల ద్వారా నీరు ఇప్పటివరకు పట్టలేదు. ట్యాంకు వద్ద నుంచి పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. మిషన్ భగీరథ నీటిని ట్యాంకు వద్దనే గ్రామస్తులు పట్టుకుంటున్నారు. జనవరిలో భగీరథకు సంబంధించిన ఓ అధికారి గ్రామానికి వచ్చారు. రెండు రోజుల్లో నీరందిస్తామని, నీటి సంపు మంజూరైందని, పనులు చేపడుతామని చెప్పి మూడు నెలలు గడిచిందని పేర్కొంటున్నారు. ఎండలు ముదిరితే సమీపంలోని ఒర్రెలో నీరు ఎండిపోతుందని పశువులకు నీరు పెట్టడం గగనమవుతుందని తెలుపుతున్నారు. గ్రామంలో పెళ్లిళ్లు, ఏదైన శుభకార్యం నిర్వహిస్తే బయట నుంచి వేల రూపాయలు ఖర్చుపెట్టి ట్యాంకర్లు కొనుక్కోవాలిసిందేనని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒర్రెలో నీరు ఉన్న రోజులు స్నానాలు, పశువుల దాహం తీర్చేందుకు ఉపయోగపడతాయని ఏప్రిల్, మే నెలలో ఇబ్బందులు తప్పేలా లేవని చెబుతున్నారు.

చర్యలు చేపట్టాలి



గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. రెండు చేతిపంపుల్లో సరిపడా నీరు లేక ఇబ్బంది పడుతున్నాం. ఏదైన శుభకార్యం జరిగితే ట్యాంకర్‌ను తెప్పించి నీటిని వాడుతున్నాం. ఉన్నతాధికారులు నల్లా నీటి అందించేలా చర్యలు చేపట్టాలి. – సిడం ధర్ము, గ్రామ పటేల్

కష్టంగా ఉంది



చేతిపంపు వద్ద ఒక బిందె నింపాలంటే కష్టంగా ఉంది. నేను గర్భిణిగా ఉన్నందున ఎవరూ లేని సమయంలో చేతిపంపు కొట్టలేకపోతున్నాను. ఇంటింటి నల్లాలు నిరుపయోగంగా ఉన్నాయి. అధికారులు నీటి సమస్య పరిష్కరించాలి.

– మడావి రాంబాయి, గృహిణి

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం మహేశ్

రెబ్బెన: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు సహకరించాలని రేకులగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కోల మహేష్ అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని వివరించారు. మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకం అమలు తీరును తల్లిదండ్రులకు తెలియజేశారు. ఎస్‌ఎంసీల పదవీ కాలం పూర్తి కావడంతో వాటి స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేస్తున్నాయన్నారు. వాటి సహకారంతో పాఠశాల అభివృద్ధి కృషి చేస్తున్నామని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయుడు రవీందర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం



డీజీఎం సతీశ్‌బాబును సన్మానిస్తున్న ఎస్వోటూ జీఎం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా సివిల్ డీజీఎంగా విధులు నిర్వహించి కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయిన సతీశ్‌బాబును బెల్లంపల్లి యాజమాన్యం శనివారం సన్మానించి వీడ్కోలు పలికింది. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఏరియా ఎస్వోటూ జీఎం నరేందర్ ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఏరియాకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. ప్రాజెక్టు అధికారి ఉమాకాంత్, ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్న, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీజీఎం ఎఫ్అండ్ఏ రామారావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఈఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐ రాంబాబు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రూరల్ సీఐగా రాంబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన నాగరాజు బదిలీ కావడంతో రాంబాబు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

చింతలమానెపల్లి ఎస్సైగా నరేశ్



నరేశ్

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి ఎస్సైగా కె.నరేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్ దీర్ఘకాలిక సెలవులో తీసుకున్నారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో బాధ్యతలు నిర్వహిస్తున్న నరేశ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై నరేశ్ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సైకి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

పీహెచ్‌సీకి వైద్యుడొచ్చాడు

సాక్షి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ క్రాంతికుమార్

కెరమెరి: గడిచిన కొంత కాలంగా కెరమెరి పీహెచ్‌సీలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో రోగులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం సాక్షిలో 'పీహెచ్‌సీ ఖాళీ'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం భట్ స్పందించారు. శనివారం కెరమెరి వైద్యాధికారిగా క్రాంతికుమార్‌ను నియమించారు. తక్షణమే ఆయన విధుల్లో చేరి రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఇప్పటి వరకు ఈయన కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం పీహెచ్‌సీలో వైద్యాధికారిగా, విధులు నిర్వహించారు. ఓవైపు పత్రికలో వచ్చిన కథనం, మరోవైపు బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం రోడ్డు పై బైఠాయించిన చేపట్టిన ఆందోళన ఫలించిందని ఎంపీపీ పెందోర్ మోతిరాం పేర్కొన్నారు. తక్షణమే స్టాఫ్‌నర్సులను, ఎల్‌టీని నియమించాలని ఆయన కోరారు.

'బీజేపీతోనే అభివృద్ధి'



పార్టీలో చేరిన నాయకులతో ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: బీజేపీతో అభివృద్ధి సాధ్యమని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కౌటాల మండలంలోని బీఎస్పీ, బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు శనివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువా కప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, పార్టీ బలోపేతం కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, నాయకులు విజయ్, బాబురావు, చందు, మధుకర్, భూమయ్య, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా తెరుచుకున్న పాఠశాల



ఉదయం 8.41 గంటల సమయంలో మూసి ఉన్న జంబుల్‌ధరి పాఠశాల

వాంకిడి: ఎండల తీవ్రత దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం శుక్రవారం నుంచి పాఠశాలలకు ఒంటి పూట బడులు నిర్వహిస్తోంది. పాఠశాలల సమయం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు కుదించింది. అయితే కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా పాత టైమ్ టేబుల్ విధానాన్నే అవలంబిస్తున్నారు. శనివారం ఉదయం «సాక్షి»పాఠశాలల సందర్శనకు వెళ్లగా వాంకిడి మండలంలోని జంబుల్‌ధరి ప్రాథమిక పాఠశాల టీచర్ మాత్రం గంట ఆలస్యంగా హాజరయ్యారు. అప్పటి వరకు విద్యార్థులు రాలేదు.

కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

వాంకిడి: మండలంలోని ఆర్లీ, నౌధరి, చిచ్చుపల్లి, దొడ్డిగూడ, అంతపూర్, సవాతి గ్రామాల్లో శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేలో భాగంగా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలం పొలాస గ్రామంలో దాడి జరిగిన ఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాదవ్ లింబారామ్‌ని అదే గ్రామానికి చెందిన రాము పాత కక్షలను మనసులో పెట్టుకుని అతడిపై కట్టెతో దాడి చేశాడు. చికిత్స అనంతరం జైనూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రాముపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తిపై కేసు

ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ మండలంలోని జామిని గ్రామంలో పంట పొలంలో గంజాయి మొక్కలు పండిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పక్కా సమాచారంతోనే జైనూర్ పోలీసులు జామిని శివారు గల చేనులో తనిఖీలు నిర్వహించగా 12 గంజాయి మొక్కలు లభించాయి. చేను సోముకు చెందినట్లుగా తెలిపారు. చేను యజమాని సోముపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



రెబ్బెన: నక్కలగూడలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి సాగర్



కౌటాల: పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

రెబ్బెన: మండలంలోని నక్కలగూడలో శనివారం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశు వైద్యాధికారి సాగర్ మాట్లాడుతూ గ్రామంలో 374 పశువులకు ఈ టీకాలు వేసినట్లు తెలిపారు. సిబ్బంది మాధవరావు, సంపత్, దర్శయ్య, విశ్వనాథ్ పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలో 250 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్య ఆధికారి మురళీకృష్ణ తెలిపారు. గోపాలమిత్ర వైద్యుడు జాధవ్ రామేశ్వర్, ఓఎస్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో శనివారం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో 459 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ జయలక్ష్మి, సహకార సంఘం ఉపాధ్యక్షుడు ధనుంజయ్, సిబ్బంది హనుమయ్య, నరేశ్, జగన్నాధరాజు, సురేశ్ రైతులు పాల్గొన్నారు.

కౌటాల: సాడ్గాం గ్రామంలో మండల పశువైద్యాధికారి ఎస్.శ్రీకాంత్ శనివారం పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెల రోజుల పాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఉపసర్పంచ్ సురేశ్, సిబ్బంది సందీప్, భిక్షపతి, ప్రకాశ్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



ఆసిఫాబాద్‌అర్బన్: నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధులు



కాగజ్‌నగర్‌రూరల్: వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వాసవిక్లబ్ ఆధ్వర్యంలో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు దీక్ష తత్పరుడని కొనియాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు వెనక్కి తగ్గకుండా పోరాటం చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి శ్రీధర్, సభ్యులు చిలువేరి వెంకన్న, సాయిని కేదారి, పిన్నా వివేక్, ఎకిరాల శ్రీనివాస్, ప్రమోద్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాముల చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గర్రెపల్లి గోపాల్, జిల్లా ప్రచార కార్యదర్శి గణపురం ప్రకాశ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములని కొనియాడారు. నాయకులు మురళీధర్, సురేందర్, కృష్ణమూర్తి, రాజేంద్రప్రసాద్, వెంకన్న, సత్యనారాయణ, విలాస్, వినోద్, పురుషోత్తం, కిశోర్, సురేందర్, వెంకన్న, శివకుమార్, రాకేశ్, కృష్ణ, లక్ష్మీనారాయణ, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఆరెగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం కెరీర్ గైడెన్స్ కోసం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రాథోడ్ సుభాష్, మోటివేషనల్ స్పీకర్ సుందిళ్ల రమేశ్ హాజరయ్యారు. విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పర్ష చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి తరగతులు ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులు, ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రతీ ఆది, రెండవ శనివారం తరగతులు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ దత్తాత్రేయ తెలిపారు. వివరాలకు తన కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు



ఏర్పాట్లు చేస్తున్న ఉపాధ్యాయులు

సిర్పూర్(టి): ఈనెల 18 నుంచి జరిగే టెన్త్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలకేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో సోమయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 199 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల పరీక్ష కేంద్రంలో 195 మంది విద్యార్థులు, సాంఘిక సంక్షేమ డీపీఐపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 181 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ద్వారా మాతా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం ఆయుర్వేద వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి.. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

20 నుంచి కబడ్డీ పోటీలు

కెరమెరి: మండలంలోని సుల్తాన్‌గూడలో కొనసాగుతున్న శ్రీ వేంకటేశ్వరస్వామి జాతరలో ఈనెల 20 నుంచి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు దండుగుల ఎల్లప్ప, కోవ దేవ్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ.500 ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్‌నంబర్‌లో 9492283624 సంప్రదించాలన్నారు.

క్వార్టర్లు స్వాధీనం చేసుకోవాలి

తిర్యాణి: అక్రమణకు గురైన మండల కేంద్రంలోని ఏఎన్‌ఎం, ఆర్‌ఐ క్వార్టర్లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ సునీల్ కుమార్‌కు జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఈ భవనాలు ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఇదే అదనుగా కొందరు ఆక్రమించుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. మాజీ సర్పంచులు మడావి గోపాల్, కుర్సెంగ బాదిరావు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

అంకుసాపూర్‌లో పోషణ్ పక్వాడ



ప్రతిజ్ఞ చేస్తున్న సీడీపీవో సురేఖ, తదితరులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుసాపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సురేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కల్పించారు. డీహెచ్‌ఈడబ్ల్యూ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శారద మాట్లాడుతూ మహిళా సాధికారత, బేటీ బచావో బేటీ పడావో పథకం, మహిళల హక్కులు, చట్టాలు, పథకాల గురించి వివరించారు. జెండర్ స్పెషలిస్టు రాణి మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్యంతోపాటు ప్రతీ మహిళా తన ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ, పంచాయతీ కార్యదర్శి సంధ్య, పోషన్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ గంగారాం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తిర్యాణి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అధికారులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద పార్టీ నాయకులు శనివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, మాజీ సర్పంచులు మడావి గోపాల్, కుర్సెంగ బాదిరావు, నాయకులు చుంచు శ్రీనివాస్, తోట లచ్చన్న, అట్టెం సుమన్, ముత్యం రాజయ్య, చందు తదితరులు ఉన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశాలి కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి, పేదలను ఆదుకోవాలని కోరారు. సహకార సంఘాల సభ్యత్వ నమోదు చేపట్టి సంఘాల బలోపేతానికి చొరవ తీసుకోవాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు సామల రాజయ్య, కోశాధికారి వనమాల మురళీకృష్ణ, నాయకులు కోమటిపెల్లి లింగయ్య, శ్రీకాంత్, శైలేందర్, మోహన్, అవుడపు ప్రణయ్, ఏసయ్య, సునీల్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న శంకర్

సిర్పూర్(టి): స్థానిక బస్టాండ్ ప్రాంతంలో ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం మండల ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండల అధ్యక్షుడు శంకర్ ప్రారంభించారు. ప్రయాణికులకు వేసవిలో తాగునీటి అందుబాటులో ఉంచేందుకే చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరెకుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

ఆసిఫాబాద్: రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు అన్నారు. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ డీలర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాపంపిణీ వ్యవస్థను సక్రమంగా నడపాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు, ఉపాధ్యక్షుడు జాడె ఆత్మారాం, కార్యదర్శి కుందారపు గోపాల్, మండల అధ్యక్షుడు రాపర్తి శ్రీనివాస్, అధికార ప్రతినిధి రాపర్తి నర్సింహులు, డీలర్లు బసువయ్య, పాండురంగ్ పాల్గొన్నారు.